

ట్యాగ్‌లైన్

పచ్చికలల ముద్ద
బతుకారా రాసుకుని
వేడినిట్టూర్పుల ఆవిరితో
ఒంటిని కడుక్కుంటుంది ఓ బంధం

నైలాన్ పువ్వుల నవ్వుల వెలుగుని
గడియారం ముల్లుకి తగిలించి
కాలం ఉచ్ఛ్వా నిశ్వాసల భాష నేర్చుకుంటుంది
ఎన్నెన్నో కథల్ని కతికిన అదేకాలం
ఏరోజుకారోజు కొత్తమార్పుల కూడలిలో
నివ్వెరపోయి నిలబడుతుంది
అచ్చం మనిషిలా

ఇక్కడ ఒకరికొకరు ఏమీకారు
అయినా ఇద్దరి మధ్య ఏదో రిలేషన్
కలిసున్నన్నినాళ్ళు కలిసుంటారు
కోరికల ఏరు దాటాక
కలల్ని తగలేసి
చెరో రిలేషన్ కోసం
తలోదిక్కుకి ఎగిరిపోతారు

ఒకరిమీద ఒకరికున్న నమ్మకాల లేమి
ఒంటిబంధాన్ని మాత్రం బలపరుస్తుంది
ఒకానొక ప్రేమరాహిత్యం
బతుకు బాల్కనీ గోడమీద అలంకరించిన
బోన్సాయ్ మొక్కలా
కుండీతో ఒప్పందం కుదుర్చుకుంటుంది
నేను చచ్చిపోతే నీకు సంబంధం లేదు
నువ్వు పగిలిపోతే నాకు సంబంధం లేదని

ఆడామగ కోఎగ్జిస్టెన్స్ డిక్షనరీ ప్రకారం
వివాహపు అర్థం వింత తంతని
విజువలైజ్ చేయబడుతుంది
లివింగ్ రిలేషన్ అన్న ట్యాగ్‌లైన్‌తో

కన్నపేగు కంటికి కనిపించదు
కనిపెంచిన ఏ కలలరాగమూ
మనసుకి వినిపించదు

కట్టుతెంచుకున్న దాహానికి
కటికుప్పునీరు ఎంత తాగితే ఏం లాభం
దాహం తీరని దాహానికి

బతుకంతా వయసు పొంగుదే
ఎలా అవుతుంది
తప్పదుకాక తప్పని
ఒక వార్ధక్యం వొంపు దగ్గర
వాత్సల్యపు తులసినీళ్ళు
ఒక్క చుక్కైనా గుటకెయ్యాల్సిందే!
నిన్ను కనిపెంచింది కానీ
నువ్వు కనిపెంచింది కానీ
నిన్ను కనిపెట్టుకుని వున్నది కానీ
ఏదైనా... ఒక్క బంధం!
నీకోసం నువ్వు అట్టిపెట్టుకోవాల్సిందే!

■ బంగార్రాజు కంఠ
✆ 85003 50464

వివిధ

సాహిత్య వేదిక vividha@andhrajyothy.com

“మరింతమంది తెలుగువారు ఇతర రాష్ట్రాల సదస్సుల్లో పాల్గొనాలి”

- సి. మృణాళిని

ప్రముఖ రచయిత్రి సి. మృణాళిని ఇటీవల కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలికి కన్వీనరుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆవిడకు అభినందనలతో వివిధ సాహిత్య వేదిక జరిపిన సంభాషణ ఇది:



మీ పదవీ కాలంలో మీరు ప్రధానంగా చేపట్టదల్చుకున్న ప్రాజెక్ట్స్ ఏమిటి?

సాహిత్య అకాడెమీలో కార్యక్రమ నిర్వహణకు ఒక పద్ధతి ఉంటుంది. అకాడెమీ పనులలో ముఖ్యమైనవి అందరికీ తెలిసినవే. సాహిత్య సదస్సుల నిర్వహణ, పుస్తకాల ప్రచురణ. కనక ఏ కమిటీ కొత్తగా రూపొందినా ఈ రెండు పనులపై ముందు కొంచెం స్పష్టత ఉండాలి.

1\. నా ఉద్దేశంలో కొత్త పుస్తకాలు ప్రచురించే ముందు గత కొన్నేళ్లుగా ప్రచురణ కావలసి వుండీ వివిధ కారణాల వల్ల కాలేకపోయిన పుస్తకాల ముద్రణ మొట్టమొదటి ప్రాధాన్యంగా భావిస్తున్నాను. నాలుగైదేళ్ల క్రిందే రచించి, సమీక్ష కూడ అయిన పుస్తకాలు సైతం ఇంకా ప్రచురణకు నోచుకోలేదు. ముందు ఆ బ్యాక్‌లాగ్ పని చూడాలి. ఆ తర్వాతే కొత్త పుస్తకాల ప్రచురణ చేపట్టాలి. అవి సమగ్రంగా ఉంటే ప్రచురించడం, లేకపోతే దిద్దే పనిని నిపుణులకో, అదే రచయితలకో అప్పగించడం చెయ్యాలి. ఏ రకంగానూ బాగాలేవనుకున్న రచనలు ఒకవేళ ఉంటే (ఉన్నాయని అనుకోను) వాటి ప్రచురణ రద్దు చెయ్యాలి. అంతేకానీ, పనులు పేరబెట్టుకుంటూ పోతే కుదరదు.

2\. సదస్సులు, సమావేశాల విషయానికి వస్తే, ఒకవైపు ఇంతవరకూ జరిగిన పద్ధతిలో కార్యక్రమాలు చేస్తూనే, తులనాత్మక సాహిత్య చర్చలనూ, యువతకు భాషాసాహిత్యాలపై అభిరుచి కలిగించే కార్యక్రమాలను రూపొందించాలని అనుకుంటున్నాను. తులనాత్మక అధ్యయనం అన్నది, అనేక భాషలున్న భారతదేశానికి ఎంత అవసరమో సాహిత్య అకాడెమీ సదస్సులకు హాజరైన ఎవరికైనా అర్థమవుతుంది. ఈ విషయంలో మన తెలుగు విభాగం వెనకబడే ఉంది.

3\. ఇతర భాషలతో పోల్చి చూస్తే, తెలుగు ప్రముఖులపై డాక్యుమెంటరీలు చాలా తక్కువ. రాబోయే అయిదేళ్లలో కొన్నయినా చెయ్యాలని అనుకుంటున్నాను. ఇది కాక ఒక్కొక్క సంవత్సరానికీ ప్రణాళికలు రూపొందిస్తున్నపుడు, సభ్యులకు కొత్త ఆలోచనలు వస్తాయి. వాటిని బట్టి కొత్త పనులు చేపట్టవచ్చు.

ఈ పదవి చేపట్టిన మొదటి మహిళగా మీ నుంచి మహిళా సాహిత్యం విషయంలో ఎలాంటి కార్యక్రమాలను ఆశించవచ్చు?

ఇదివరకు సాహిత్య అకాడెమీలలో 10మంది సభ్యుల్లోనూ నామమాత్రంగా ఒకే మహిళ ఉండేవారు. ఈసారి నాతో సహా ముగ్గురం ఉన్నాం. కనక ప్రారంభం బాగానే జరిగింది.

ఇకపోతే, జాతీయ స్థాయిలో ‘అస్మిత’ పేరిట అన్ని భాషల్లోనూ స్త్రీల రచనలతో మంచి కార్యక్రమాలు జరుగుతాయి. ఇది కాక కవి సంధి, కథాసంధి, త్రూ మై విండో కార్యక్రమాల్లో కూడ మహిళల సంఖ్య పెరగాలని అనుకుంటున్నాను. రచయితలు, కవులతో ముఖాముఖీలో రచయిత్రుల సంఖ్య పెరగాల్సివుంది. భారతీయ సాహిత్య నిర్మాతల్లో ఇప్పటి వరకూ ఎవరెవరివి వచ్చాయో చూసి, విస్మరించిన స్త్రీలు ఉంటే వెదకిపట్టుకుని, మోనోగ్రాఫ్‌లు రాయించాల్సి వుంటుంది.

కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇతర భాషల్లో వస్తున్నట్టు తెలుగు సాహిత్యకారులపై మోనోగ్రాఫులు, డాక్యుమెంటరీలు తక్కువ వచ్చాయి. ఈ దిశగా ఏం చేస్తే బాగుంటుంది?

పైన చెప్పినట్టు, మోనోగ్రాఫుల్లో ఆడ, మగా తేడా లేకుండా కొద్దిమందికైనా అన్యాయం జరిగింది. ఎప్పుడో మోనోగ్రాఫులు రావాల్సిన సాహిత్యకారులకు ఇంకా రాకపోవడం ఆశ్చర్యమే. దానికి తెలుగు సంఘమే బాధ్యత వహించాలి. మేము చేసే ప్రతిపాదనలపైనే కేంద్ర సంఘం చర్యలు తీసుకుంటుంది కనక, ఇక్కడే సరైన ప్రతిపాదనలు, ప్రణాళికలు రూపొందాలి.

డాక్యుమెంటరీల విషయంలో నేను చేసేది ఆరోపణలా కనిపించవచ్చునుగానీ ఒకటి నిజం. డాక్యుమెంటరీల బడ్జెట్, మామూలుగా డాక్యుమెంటరీలు తీసేవాళ్లతో పోల్చి చూస్తే కొంత తక్కువగా ఉండవచ్చు. కేంద్ర సాహిత్య అకాడెమీ 24 భాషల్లోనూ డాక్యుమెంటరీలకు బడ్జెట్ కేటాయించాలి కనక తక్కువే ఉంటుంది. మన దగ్గర తక్కువ నిధులతో నాణ్యమైన పనులుచేసే దర్శకులు/నిర్మాతలు లేరు. పొరుగుభాషల్లోనైతే అవార్డులు పొందిన దర్శకులు సైతం, తమంతటతాము తమ భాషలోని ఉత్తమ సాహిత్యకారుడి డాక్యుమెంటరీని పారితోషికం గురించి పట్టించుకోకుండా చేయడం చూస్తాం. ఆ భాషా నిర్మాతలకు, దర్శకులకు సాహిత్యంపై ఉన్న అభిరుచి అలాంటిది. మన దగ్గర కూడా ఎవరైనా మంచి దర్శకుడు ముందుకు వచ్చి, అలా చేయగలిగితే, నాణ్యమైన డాక్యుమెంటరీలు రూపొందవచ్చు. ఇటీవల యువతరంలో మంచి అభిరుచి, నైపుణ్యం కలిగిన డాక్యుమెంటరీ నిర్మాతలు కనిపిస్తున్నారు. వారి సేవలను వినియోగించుకోవచ్చునేమో చూడాలి.

> **మన దగ్గర తక్కువ నిధులతో నాణ్యమైన పనులు చేసే దర్శకులు/ నిర్మాతలు లేరు. పొరుగు భాషల్లోనైతే అవార్డులు పొందిన దర్శకులు సైతం, తమంతటతాము తమ భాషలోని ఉత్తమ సాహిత్యకారుడి డాక్యుమెంటరీని పారితోషికం గురించి పట్టించుకోకుండా చేయడం చూస్తాం.... మన దగ్గర కూడా ఎవరైనా మంచి దర్శకుడు ముందుకు వచ్చి, అలా చేయగలిగితే, నాణ్యమైన డాక్యుమెంటరీలు రూపొందవచ్చు**

తెలుగు సాహిత్య చరిత్రపై కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఇప్పటికే ఒక ప్రాజెక్టు జరుగుతోంది. దాని గురించి చెప్పండి?

ఈ ప్రాజెక్టు ఇంకా రచన దశలోనే ఉన్నట్టుంది. నేనింకా ఆ పుస్తకాన్ని చూడలేదు. దానికి విడిగా సంపాదకవర్గం ఉంది. వారు తమ పనిని కొనసాగిస్తారు. దాన్ని సమగ్రంగా రూపొందిస్తారని భావిస్తున్నాను. ఇంకా ఎంత వ్యవధి వారికి అవసరమన్నది వారితో చర్చించాకే నిర్ణయిస్తాం.

సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో పుస్తకాల స్టోర్ల ఏర్పాటుకు ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా?

ఇదివరకు, అంటే డా. జివి సుబ్రహ్మణ్యంగారు సాహిత్య అకాడెమీ కన్వీనర్‌గా, తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా ఉన్నపుడు, సాహిత్య అకాడెమీతో చర్చించి, తెలుగు విశ్వవిద్యాలయం ముద్రణశాఖలో ప్రత్యేకమైన రాక్‌లు సాహిత్య అకాడెమీ ప్రచురణలకు కేటాయించాం (అప్పుడు నేను సలహా మండలి సభ్యురాలిగా ఉన్నాను). అది కొంతకాలం బాగానే నడిచింది. ఎందుకు ఆగిపోయిందో తెలీదు. ఎప్పుడో సాహిత్య అకాడెమీ ప్రచురణల ప్రదర్శన పెడితే తప్ప వారి పుస్తకాలు తెలుగు ప్రజలకు అందకపోవడం సరైనది కాదు. ముఖ్యంగా తులనాత్మక సాహిత్యంపై సదస్సులు నిర్వహించాలంటే ఇతర భాషల అనువాదాలు అందుబాటులో ఉండాలి. సాహిత్య అకాడెమీ పుస్తకాల స్టాల్స్ ఎప్పటికీ అందుబాటులో ఉండే విషయంలో కాస్త గట్టి ప్రయత్నమే చేయాల్సి వుంటుంది.

తెలుగులో అవార్డులు పొందిన పుస్తకాలను ఇతర భాషల్లో అనువదించే పని ఎలా జరగబోతోంది?

అవి రావలసినంత త్వరగా రావడం లేదన్న మాట నిజం. ఆంగ్లం, హిందీలలో వచ్చినంత వేగంగా ఇతర భారతీయ భాషల్లోకి అనువాదాలు రావు. ఎక్కువమంది అనువాదకులు మన దగ్గర ఇంగ్లీషు, హిందీల ద్వారా అనువాదం చేస్తారు. అంటే తెలుగు రచన ఆ రెండిట్లో ఏదో ఒక భాషలోకి ముందు వెళ్లాలి. తర్వాత దాన్ని ఇతర భారతీయ భాషల్లోకి చెయ్యాలి. మలయాళం, తమిళం, కన్నడం వరకూ నేరుగా చేసేవాళ్లు ఒకరిద్దరు ఉన్నారు కానీ, ఎక్కువభాగం మూడో దశ రచనే అవుతుంది కనక టైం పడుతుంది.

జాతీయ స్థాయిలో తెలుగు సాహిత్య ప్రచారం మరింత విస్తృతంగా ఎలా జరపవచ్చు?

తెలుగు సాహిత్య ప్రచారం జరగాలి అంటే మరింతమంది తెలుగువారు ఇతర రాష్ట్రాలలో జరిగే సదస్సుల్లో పాల్గొనాలి. ఇప్పటికే పాల్గొంటున్నారు. కానీ ఎక్కువమంది ఏం చేస్తున్నారంటే, తమ కవితో, కథో, పత్ర సమర్పణో అయిపోయాక మిత్రులను కలవడానికో, ఊరు చూడ్డానికో వెళ్లిపోతారు. ఇతర భాషలవారి ప్రసంగాలు వినడం తమ పని కాదనుకుంటారు. అయితే వారివి కూడ విని, వారితో మన భాషలో ఉన్నవి చర్చించడం చేసినపుడు, మన భాషపై వారికి కుతూహలం కలుగుతుంది. ఇద్దరి మధ్యా ఆదాన్ ప్రదాన్‌లు జరుగుతాయి. ఇతర బాషావేత్తలతో పరిచయాలు పెంచుకోవడం అవసరం. ఇక్కడ మరోసమస్య. ఆ పరిచయాలను స్వలాభం కోసం వాడుకునే ప్రమాదం ఉంది. అలా కాక, తెలుగు సాహిత్యానికి ఉపకరించేలా మలుచుకోవడం ఇంకా అవసరం.

మరో ముఖ్యమైన విషయం- ఆంగ్లంలో తెలుగు రచయితల రీడర్స్ తీసుకురావడం. నేను క్రితం సారి జనరల్ కౌన్సిల్ సభ్యురాలిగా ఉన్నపుడు, ఈ విషయాన్ని ప్రతిపాదించాను. అంటే తెలుగు సాహిత్య దిగ్గజాల రచనల్లో, ఇతర బాషల వారికి ఆసక్తి కలిగించగల కొన్ని రచనలను ఎంపిక చేసి, ఇంగ్లీషులోకి అనువదింపజేసి, ఒక సంకలనంగా తీసుకురావడం. ఆ క్రమంలో నా సంపాదకత్వంలోనే ‘గురజాడ- ఎ రీడర్’ రూపొందించడం పూర్తయింది. అది ముద్రణలో ఉంది. ఇలా మరికొందరి మీద, రీడర్స్ రావాలి.

కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు ప్రాంతీయ కార్యాలయాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఆశించవచ్చా?

నాకు తెలిసినంతవరకూ లేదండీ. తెలుగుకు అంటూ విడిగా ప్రాంతీయ కార్యాలయం ఉండదు. నాలుగు దక్షిణభాషలకూ కలిపి, బెంగుళూరులో ప్రాంతీయ కార్యాలయం ఉంది. ఇది కేంద్ర సాహిత్య అకాడెమీ విధాన నిర్ణయానికి (పాలసీకి) సంబంధించిన విషయం. ■

పదకొండేళ్ల కవిసంగమం

‘కవిత్వకూడలిగా పదకొండేళ్ల కవిసంగమం - ఒక అవగాహన’ కార్యక్రమం మార్చి 26 సా.6గం.లకు దొడ్డి కొమురయ్య హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. సభలో కోడూరి విజయకుమార్, కె. శివారెడ్డి, జి. లక్ష్మీనరసయ్య, పులికొండ సుబ్బాచారి, సీతారాం, శిలాలోలిత, ఎం. నారాయణ శర్మ, అనిల్ డ్యాని, అన్వర్ తదితరులు పాల్గొంటారు.

యాకూబ్

రజనీశ్రీ కథా పురస్కారం

జాతీయ సాహిత్య పరిషత్ కరీంనగర్ జిల్లా శాఖ సాహిత్య సృజనకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక రజనీశ్రీ కథ పురస్కారానికి 2023 సంవత్సరానికి కె.వి. మేఘనాథ్ రెడ్డి రచించిన ‘కలుంకూరిగుట్ట’ ఎంపికైంది.

గాజుల రవీందర్

మల్లవరపు సాహితీ పురస్కారాలు

పద్యకవి మల్లవరపు జాన్ సాహితీ పురస్కారాలను నాగసూరి వేణుగోపాల్ (2020), శిఖామణి (2021), యెల్లపు ముకుంద రామారావు (2022) ఎంపికయ్యారు. త్వరలో హైదరాబాదులో జరిగే కార్యక్రమంలో పురస్కార గ్రహీతలను రూ.5 వేల నగదు, జ్ఞాపిక, శాలువతో సత్కరిస్తారు.

నూకతోటి రవికుమార్

కె.వి.ఆర్ స్మారకోపన్యాస సభ

కె.వి. రమణారెడ్డి స్మారకోపన్యాస సభ, ఆయన రాసిన ‘మహోదయం’ పుస్తకావిష్కరణ సభ మార్చి 26 సా.6గం.లకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్, చల్లపల్లి బంగ్లా వద్ద, విజయవాడలో జరుగుతాయి. సభలో గురజాడ వెంకటేశ్వర ప్రసాద్, గురజాడ ఇందిర, తాటి శ్రీకృష్ణ, సింగంపల్లి అశోక్ కుమార్, నల్లూరి రుక్మిణి, వకుళాభరణం రామకృష్ణ పాల్గొంటారు. ఎన్. వేణుగోపాల్ ‘మతవర్గతత్వం భావన - కె.వి.ఆర్ ప్రాసంగికత’ అంశంపై స్మారకోపన్యాసం చేస్తారు.

కె.వి.ఆర్., శారదాంబ స్మారక కమిటీ

పెన్నా సాహిత్యం పురస్కారం

2022 పెన్నా సాహిత్య పురస్కారానికి సుంకర గోపాలయ్య రచించిన ‘మా నాయన పాట’ కవితా సంపుటి ఎంపికైంది. న్యాయ నిర్ణేయతలుగా మేడిపల్లి రవికుమార్, మందరపు హైమావతి వ్యవహరించారు. త్వరలో జరగబోతున్న పెన్నా సాహిత్య పురస్కార సభలో వారికి నగదు బహుమతి మరియు పురస్కారాన్ని అందజేస్తాము.

అవ్వారు శ్రీధర్ బాబు

కథా సంపుటి ఆవిష్కరణ సభ

కథా స్రవంతి సిరీస్‌లో భాగంగా అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు ప్రచురించిన ‘ఎం హరికిషన్ కథలు’ ఆవిష్కరణ కార్యక్రమం ఏప్రిల్ 2న కర్నూలు లలిత కళా సమితిలో జరుగుతుంది. సభలో పాలగిరి విశ్వప్రసాద్, జి. ఉమామహేశ్వర్, తవ్వా ఓబుల్ రెడ్డి, జంధ్యాల రఘుబాబు, కలం ప్రహ్లాద, కొత్తపల్లి సత్యనారాయణ, కె చంద్రమౌళి తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 94410 32212.

కర్నూల్ అరసం శాఖ



సంచార వాదానికి దివిటీ పట్టిన కథలు


‘కారణాలు, స్వేచ్ఛ సహజంగా లభించవు. అవి చారిత్రక విజయాలు’ (Reasons and freedom do not come naturally. They are historical achievements) అంటాడు ప్రఖ్యాత జర్మన్ తత్వవేత్త ఫ్రెడిక్ హెగెల్. ఆధునిక గతితార్కిక భావనకు పునాది వేసిన ఈయన రచనలలో భావవాదం, జడవాదంపై నిరసన వ్యక్తం చేశాడు. హెగెల్‌ను కార్ల్ మార్క్స్ తన గురువుగా భావించాడు. హెగెల్ చెప్పినట్టు సాహిత్యం నిరంతర మార్పులకు లోనయ్యేది. భావవాది కానిది. తెలంగాణ ప్రాంతం గత అర్ధశతాబ్ద కాలంగా ప్రపంచస్థాయి అస్తిత్వ ఉద్యమాలకు కేంద్రబిందువైంది. ఇక్కడి ప్రజలు ఉద్యమించడానికి కారణాలు, స్వేచ్ఛ సహజంగా లభించలేదు. రాజకీయ, సాంఘీక, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, భాషాపర కారణాలు, ఉద్యమాలు సంభవించాయి.

స్వేచ్ఛ కారణంతో నిజాం వ్యతిరేకపోరాటం, స్వీయపాలన, ఆత్మగౌరవం వంటి రాజకీయ కారణాలతో ప్రత్యేక రాష్ట్ర తొలి, మలి దశ ఉద్యమాలు, ఆర్థిక పరమైన అసమానతల కారణాలతో అభ్యుదయ, విప్లవ, వామపక్ష పోరాటాలు, ఉద్యమాలు, సామాజిక అసమానతల కారణంగా దళిత, మైనారిటి, బహుజన, స్త్రీవాద ఉద్యమాలు సంభవించాయి. ఇవన్నీ ఇక్కడ జీవించే ప్రజల సమస్యలు. వాటి పరిష్కారానికి ఉద్యమించిన కారణాలు. కవులు, రచయితలు సాహిత్య ఉద్యమాల ద్వారా ప్రజలను నడిపించడంలో, ప్రభుత్వాలను ఆలోచింపజేసే విధంగా రచనలు చేస్తూ వచ్చారు. ఇది ఈ నేలకున్న సాహితీ గొప్పదనం. ఇక్కడ నుండి బలమైన ప్రాపంచిక దృక్పథంతో సాహిత్యోద్యమాలు వచ్చినా, ఇక్కడ మంచి సాహిత్యం లేదనే అపవాదును వలస సాహిత్యకారులు ప్రచారంలోపెట్టారు. ఇప్పుడు తెలంగాణలో సాహిత్యోద్యమం మరింత అడుగు వర్గాలను చేరినట్టు ‘గంగెద్దు’ కథల ద్వారా అర్థమవుతుంది.

సంచారులు ఈ దేశపు మొదటి అక్షర జ్ఞానులు. వారినుండి అగ్ర వర్ణాలు బలవంతంగా భూమిని లాక్కోవడంతో వారు ఆశ్రితులుగా, భిక్షగాళ్ళుగా మారి సంచారులయ్యారు. అగ్రవర్ణాలు వారి దగ్గరున్న కథలు, గేయాలు, కళలు దొంగిలించి, తమవిగా చరిత్రలో రికార్డు చేసుకున్నారు. మేధావులుగా చెలామణీ అయ్యారు. సమాజాన్ని కులాల పేరుమీద విభజన చేసి అధికారాన్ని కైవసం చేసుకున్నారు. తరువాత అడుగు, బడుగు, బలహీన వర్గాలను తొక్కిపెడుతూ, వారికి భూమి, చదువు, అధికారం, సామాజిక హోదా లభించకుండా సామాజిక కట్టుబాట్లను రూపొందించారు. వారి ఐక్యమత్యాన్ని విడదీయడానికి ఎన్నో రకాల ఎత్తుగడలు వేస్తున్నారు. ఈ కట్టుబాట్లు, ఎత్తుగడలకు వ్యతిరేకంగా దళిత, బహుజన వర్గాల ఐక్యత, సంక్షేమమే పరమావధిగా బసవేశ్వర్, జ్యోతీరావు పూలే, పెరియార్ రామస్వామి నాయకర్, నారాయణ గురు, కబీర్, బిర్సాముండా, గాడ్గే బాబా, డా. బాబా సాహెబ్ అంబేద్కర్, కాన్షీరామ్ వంటివారు కృషిచేశారు.

> **శీలం భద్రయ్య విద్యావంతుడు. తెలుగు అధ్యాపకుడు. కథ, కవిత్వంలో ‘యాసనే’ శ్వాసగా బతుకుతున్నవాడు. తెలంగాణ భాష, వస్తువు, శిల్పం, రచనా సౌందర్యాన్ని ఇనుమడించి కథలు రాస్తున్నాడు. బోయ జంగయ్య తరువాత కథామెరుపును దక్షిణంవైపు మళ్ళించాడు. తీరాంధ్ర, రాయలసీమ మాండలిక కథకు ధీటుగా తెలంగాణ కథను పండిస్తున్నాడు.**

వారి దారిలో నవీన సామాజిక సైద్ధాంతిక దృక్పథం కలిగిన కథా రచయితగా శీలం భద్రయ్య కన్పిస్తున్నాడు. తన మొదటి కథాసంపుటి ‘లొట్టపీసు పూలు’ శీర్షికతో వచ్చిన కథలలో అస్పృశ్యత, అణిచివేత ప్రధానంగా ఉంది. శీలం భద్రయ్య రెండో కథల సంపుటి ‘గంగెద్దు’. ఈ కథలు అణచివేతకు ఎదురుతిరిగిన ధిక్కారాన్ని ప్రదర్శించిన కథలు. దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాద ఉద్యమాలకు కొనసాగింపుగా సంచారవాదానికి, దారికి దివిటీపట్టిన కథలు. సాంప్రదాయ కట్టుబాట్లు తెంచుకుని భూమి, చదువు, అధికారంకోసం ధిక్కారాన్ని ప్రదర్శించిన బహుజనపోరాటమే ఈ ‘గంగెద్దు’ కథలలో కన్పిస్తుంది.



ఈ సంపుటిలో ‘గంగెద్దు’ కథ గంగెద్దుల వారి సంచార జీవితాన్ని పట్టిచూపిన కథ. కథలో శివుడు తండ్రి గట్టయ్య ప్రమాదవశాత్తు గంగెద్దునాడించే సమయంలో చనిపోతాడు. ఊరిపెద్ద కరణం పంతులు గట్టయ్య చనిపోయాక గంగెద్దునూ, ఊరి భూములన్నీ తన ఆధీనంలోకి తీసుకుంటాడు. ఊరంతా అతని మాటకు గంగెద్దులా తల ఊపే బాపతులా ఉంటుంది. ఉపాధి, ఉద్యోగాలులేని నేటి యువతకు ప్రతినిధిగా శివుడు, నియంతలా మారిన నేటి రాజకీయనాయకులకు ప్రతీకగా ఊరిపెద్ద కరణం పంతులు కనబడుతారు. కథలో భూమికి ప్రతీకగా ‘గంగెద్దు’ కన్పిస్తుంది. ప్రతీకాత్మకంగా చెప్పిన ఈ కథలో గంగెద్దుపోరాటం వలన అంతిమంగా సంచారులకు భూమి, స్థిరజీవనం లభిస్తుంది. హెగెల్ చెప్పినట్టు ఇది సహజంగా లభించలేదు. భూమి మనిషికి ఉపాధి మాత్రమే కాదు, మనిషికి ‘తావు’. నిజాం అధికారానికి ఎదురు నిలిచి పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తి ‘తావు’ కథలో గిరిజన మహిళ శాంతమ్మ పాత్రలో కన్పిస్తుంది. రజాకార్ల దురాగతాలు ముస్లింలపై కూడా జరిగాయని పట్టిచూపే కథ ‘కాగడ’. ఈ కథలో మైబెల్లి పాత్ర పాఠకుల హృదయాల్లో అచిరకాలం నిలిచిపోయే పాత్ర. గతంలో రచయితలు హిందూ ముస్లింల ఐక్యతను గురించిన కథలు రాశారు. కానీ సమాజంలో అడుగునున్న దళిత, దూదేకుల సమ జీవన, శ్రమ సామరస్యాన్ని చెప్పిన మొదటి కథ ‘పాకీజ’. చాలా కాలంగా పారిశుద్ధ్య కార్మికులుగా మేతరి, రెల్లి, దళితులు పనిజేస్తున్నారు. వాళ్ళు ఇంకా అదే వృత్తిలో కొనసాగడానికి కారణమెవరన్నది నాగరిక సమాజం ఆలోచించాలి. అధికారం దక్కగానే కాపాడుకోవడానికి చేసే నీచ ప్రయత్నాలను ఎండగట్టిన కథ ‘కుర్చీ’. గొప్ప శిల్ప నైపుణ్యానికి ఈ కథ ఉదాహరణ. అధికారం దక్కగానే దళిత, బహుజన ఉద్యోగులను వేధించే నాయకుల గురించి హాస్యస్ఫోరకంగా చెప్పిన కథ ‘భయం’. ఆ ఉద్యోగుల మానసిక స్థితిని హృద్యంగా అంతస్రవంతి శిల్ప నైపుణ్యంతో చెప్పిన ‘అద్దం’. అడుగు జీవితాలలో సామాజిక హోదా భద్రత కరువుకు ప్రబల సాక్ష్యం ‘బ్యాడ్ టచ్’ కథ. రాజ్యాంగం విలువలు, మహిళా సాధికారతను మరిచి అప్రకటిత మనుస్మృతి అమలు చేస్తున్న పాలనా విధానాల ప్రభావంతో సమాజంలో అంతరాలను సృష్టిస్తున్నారు. మహిళకు తగిన గౌరవం, భద్రత కల్పించడం లేదు. ఈ విషయాన్ని ‘పరువు’ కథలో చక్కగా చిత్రించాడు.

“స్వతంత్ర్యంగా జీవించగలిగి బానిస భావాలున్న వ్యక్తి కంటే, స్వతంత్ర్య భావాలున్న బానిస వెయ్యిరెట్లు మేలు” అంటారు అంబేద్కర్. ఆయనను ప్రపంచ మేధావిగా మార్చింది చదువు. అందుకే ఆయన రాజ్యాంగంలో చదువును ప్రాథమిక హక్కుగా చేర్చాడు. పాలకుల నిర్ణయాలు, ప్రపంచీకరణ, పెట్టుబడిదారీ విధానం వలన విద్య పేదవానికి అందని ద్రాక్షయింది. ‘గంగెద్దు’ సంపుటిలో అంబేద్కరిజాన్ని, చదువు గొప్పదనాన్ని పట్టి చూపిన కథ ‘గంట’. ఈ కథలో గ్రామీణ పేదలకు అనారోగ్యం, వారి పిల్లలకు ఆకలిని చిత్రించింది. అప్పులు తీర్చుకోవడం కోసం పనిగంట, ఆకలి తీర్చుకోవడం కోసం గుడిగంటలో బందీ అయిన ఊరి బాల్యాన్ని బడిగంటతో ముడిపెట్టి కథకు చక్కని ముగింపునిచ్చాడు. అడుగు వర్గాల ఎదుగుదలకు చదువు ముఖ్యమనే అంబేద్కర్ భావన రచయితలో బలంగా ఉన్నట్టుంది.

తెలంగాణ తెలుగు నిండైన భాష. నిర్మాణ పరంగా ఇక్కడి భాషా వైవిధ్యం గొప్పది. అందుకే వ్యాపార, వాణిజ్యాలలో తెలంగాణ భాషకు అగ్రపీఠం వేస్తున్నారు. భాషపరంగా వస్తున్న మార్పులను, గొప్పదనాన్ని విశ్వవిద్యాలయాలు ఎప్పటికప్పుడు పరిశోధించి రికార్డు చేయాలి. రాష్ట్ర సాధనోద్యమన్ని సాహితీవేత్తలే ముందుండి నడిపించారు. సాహితీ అవార్డులు, పీఠాల నియామకాలలో దక్షిణ తెలంగాణపై వివక్ష ఉంది. స్కూల్ స్థాయి నుండి విశ్వవిద్యాలయాల వరకు భాషాపరంగా సరైన అకడమిక్ స్థాయి భాషా నిర్మాణం జరగడం లేదు. అధికారానికి దగ్గరగానున్న వారి పెత్తనంతో వారు చెప్పిందే తెలంగాణ భాషగా చెలామణి అవుతుంది. నేటి సాహిత్యంలో వలసవాదం, ఉత్తర తెలంగాణ పెత్తనం, ముఠాలు, కోటరీలు, ఒక రాజకీయపార్టీకి వత్తాసు పలకడం, అవార్డుల పిచ్చి ప్రధాన సమస్యలుగా మారిపోయాయి. ప్రజాపోరాటాన్ని, బాధలను రాయడం మరిచిపోయారు. వారికి బానిస పత్రికాధిపతులు, అధికార వ్యామోహం కలిగిన నేతలు తోడయ్యారు. సాహిత్యం విశాలమైనది. రాజకీయం అందులో ఒక భాగం మాత్రమే. సాహిత్యకారులు ఏకంగా పార్టీ కార్యకర్తల్లా పనిజేస్తున్నారు.


శీలం భద్రయ్య విద్యావంతుడు. తెలుగు అధ్యాపకుడు. కథ, కవిత్వంలో ‘యాసనే’ శ్వాసగా బతుకుతున్నవాడు. తెలంగాణ భాష, వస్తువు, శిల్పం, రచనా సౌందర్యాన్ని ఇనుమడించి కథలు రాస్తున్నాడు. బోయ జంగయ్య తరువాత కథామెరుపును దక్షిణంవైపు మళ్ళించాడు. తీరాంధ్ర, రాయలసీమ మాండలిక కథకు ధీటుగా తెలంగాణ కథను పండిస్తున్నాడు. అండ్ల దుర్గం, ఇండ్ల దుర్గంగాళ్ళ గందరగోళం వదిలి ‘గంగెద్దు’ కథల్లాంటి సాహితీ సాల్లు దున్ని, సాంస్కృతిక వారసత్వాన్ని నిలబెట్టే మరో సాహితీ ఉద్యమం మొదలయింది. ఈ కారణంతో అటువైపు అడుగులేద్దాం కలిసిరండ్రీ...

■ వేముల ఎల్లయ్య
✆ 9440002659

వచన కవితలకు ఆహ్వానం

అంబేద్కర్ మహా విగ్రహం, సచివాలయం, అమర జ్యోతి... ఇవన్నీ తెలంగాణ సాకారం చేసుకున్న కలలు. ఆ చరిత్రను, ఆ కలను, ఆ పులకరింతను అక్షరీకరించి రేపటి పుటల్లో భద్రపరిచే బాధ్యతను కవులకు, విద్యార్థులకు అప్పగించాలనుకుంటున్నాం. అంబేద్కర్ విగ్రహం, సచివాలయం, తెలంగాణ అమరజ్యోతిపై కవులు విద్యార్థులు కవితలు రాసి పంపాలి. వాటిని తెలంగాణ సాహిత్య అకాడమి ఒక సంకలనంగా ప్రచురిస్తుంది. ఈ మూడు అంశాలపై వేరువేరుగా 25 పంక్తులకు మించకుండా మార్చి 31వ తేదీలోపు కవితలను 9440233261 నంబరుకు వాట్సాప్ గానీ, ఈమెయిల్ ఐడి: tsakademi.2017@gmail.comకు ఈమెయిల్ గానీ చేయాలి.

జూలూరు గౌరీశంకర్



జ్వరమాని

అమ్మ
కూతురుగా తిరిగి వస్తుందంటే
నమ్మకం కలిగేది కాదు
మాటువేసి అదనుచూసి
పెద్దవయస్సు బొబ్బిలిలా
మీదవిరుచుకు పడ్డప్పుడు
నీటిలో ముళ్లల్లా
ఆరోగ్య సమస్యలు
అదాటుగా పంజావిసిరినప్పుడు
అప్పుడు తెలిసింది.
అరటి చెట్టు మొవ్వలోంచి
నవనవలాడుతూ బయటికి తొంగిచూసిన
లేలేత మారాకులా వుండే కూతురు
ఈరోజు
గాలిగుర్రాలమీద దౌడుతీసే
పెనుతుపాను గాలులకు
రెపరెపలాడే
రావి ఆకులా వొణికిపోయింది.
చిన్నప్పుడు చిటికెన వేలు పట్టుకుని
చిటిపొటి అడుగులు వేయించానేమో
ఇప్పుడు అడుగులు తడబడుతున్నవేళ
నా చేదండను తన చిన్ని అరచేత అదిమిపట్టి
పర్వాలేదు నాన్నా అంటుంది.
ఇన్నాళ్లు నా జీవితానికి
కొలమానం అయిన తనే
ఇప్పుడు ఇంతటి జ్వరతీవ్రతలోను
తాకితే వ్యాకోచించే పాదరసం లాంటి
ప్రేమజ్వరమాని అయింది
కన్నుతెరవని మగత నిద్రలో
నుదుటిమీద కప్పిన తడి వస్త్రాన్ని
ఏ అపరాత్రో తడిమిచూసుకుంటానా
అక్కడ వస్త్రానికి బదులు
వొక తమలపాకులాంటి శీతల హస్తం
తల్లిచేయ్యై ఆదుర్దా పడుతుంటుంది.
వొత్తిళ్ల పరీక్షలప్పుడు
నిద్రకాచిందో లేదో తెలియదు
ఇప్పుడు మాత్రం నిద్రను
కాఫీడికాక్షన్‌లా
తెల్లవార్లూ మరగకాస్తూనే వుంది
ఫోటోలోని చందమామ మోములాంటి
అమ్మమ్మను చూపిస్తూ
మారాము చేస్తుంటే గారాబుగా
గోరుముద్దలు తినిపించానేమో
అదేపనిగా ఇదే చివరిముద్ద అంటూ
తరగని తన ప్రేమను తినిపిస్తుంది.
కాస్త తేరుకున్నాక తేటపడ్డాక
కళ్లను రెండు వర్షామేఘాలుగా చేసుకుని
మళ్లీ వస్తాను జాగ్రత్త నాన్నా అంటూ
పయనమైనపుడు
అమ్మ
కూతురుగా తిరిగి వస్తుందని
గట్టినమ్మకం కలిగింది.

(నందినికి...)

■ శిఖామణి
✆ 98482 02526